బీఆర్ఎస్ సోషల్‌మీడియా కార్యదర్శిపై దాడి

'ఎస్సారెస్పీ నీళ్ల'పై పోస్టు పెట్టినందుకు కాంగ్రెస్ దౌర్జన్యం

ధర్మారం, మార్చి 19: ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపిన వారిపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడులకు దిగుతున్నారు. తాజాగా.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ప్రధాన కార్యదర్శి, ధర్మపురి నియోజకవర్గ బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ సల్వాజీ మాధవరావుపై దాడి చేశారు. ఎస్సారెస్పీ కెనాల్ నీరు రాక ధర్మారం మండలంలోని పలు గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాధవరావు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ కార్యకర్తలు సోగాల తిరుపతి, సోగాల వంశీ, మరో ముగ్గురు వ్యక్తులు కలిసి.. సోమవారం రాత్రి మాధవరావు ధర్మారంలో ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పని ముగించుకుని వెళ్తుండగా దాడి చేశారు. ఈ విషయమై మాధవరావు స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టీ సత్యనారాయణ తెలిపారు. కాగా.. మాధవ రావు తనను ఎస్సీ కులం పేరిట దూషించారని సోగాల తిరుపతి ఫిర్యాదు చేశాడు. దీంతో అదే రాత్రి మాధవరావుపై అట్రాసిటీ కౌంటర్ కేసు నమోదుచేసినట్టు పోలీసులు చెప్పారు. సల్వాజీ మాధవరావుపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఇచ్చిన పిలుపు మేరకు ధర్మారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రోద్బలంతోనే కాంగ్రెస్ కార్యకర్తలు రెచ్చిపోతున్నారని బీఆర్ఎస్ ధర్మారం మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్ విమర్శించారు. మాధవరావుపై దాడి చేయడమే కాకుండా ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కౌంటర్ కేసు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, మాధవరావుకు న్యాయం జరగాలని కోరుతూ ధర్మారంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

గాయపడిన మాధవరావు

కేటీఆర్‌కు అమెరికా వర్సిటీ ఆహ్వానం

- ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనండి
- భారత పారిశ్రామిక రంగ సవాళ్లపై ప్రసంగించండి
- మాజీ మంత్రికి నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఇల్లినాయిస్ రాష్ట్రంలో ఏప్రిల్ 13న జరగబోతున్న సదస్సులో 'భారత పారిశ్రామిక రంగంలో నెలకొన్న అవకాశాలు, సవాళ్లు' అంశంపై ప్రసంగించాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వంలో ఐటీ, పారిశ్రామికశాఖ మంత్రిగా పనిచేసిన సందర్భంగా పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి రూపకల్పన చేసిన విధానాలు, ఫలితంగా సాధించిన విజయాలను సదస్సులో వివరించి స్ఫూర్తి నింపాలని విన్నవించింది. ఈ మేరకు యూనివర్సిటీలోని కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ డైరెక్టర్ శ్వేత మేడపాటి లేఖ రాశారు. ప్రస్తుతం భారత పారిశ్రామిక రంగంలో కొత్త అవకాశాలు ఎలా ఉండబోతున్నాయి? క్షేత్రస్థాయిలో ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది? అన్న అంశంపై చర్చించేందుకు ఇండస్ట్రీ లీడర్లు, వ్యాపార వేత్తలు, విధానాల రూపకల్పనలో అనుభవం కలిగిన నాయకులను ఒక్క తాటిపైకి తేవాలన్న ఆలోచనతోనే ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న ఆశయంతో యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇలాంటి ఎన్నో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు.

లోకం పోకడ



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, హరిప్రియా నాయక్

కవితపై రాజకీయ కుట్ర

కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే ఆమెపై మోదీ కేసు

- మోదీకి డబ్బిచ్చామని ఎవరైనా అంటే.. అరెస్టు చేస్తారా?
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): కేసీఆర్‌ను రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతోనే ఎమ్మెల్సీ కవితపై తప్పుడు కేసుపెట్టారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. మోదీ, ఈడీ ఒకటేనని అన్నారు. కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చినంత మాత్రాన అవినీతి జరిగినట్లేనా అని ప్రశ్నించారు. ఎవరైనా ఒక వ్యక్తి మోదీకి డబ్బులు ఇచ్చామంటే ప్రధానిని అరెస్ట్ చేస్తారా అంటూ నిలదీశారు. కవిత ఎలాంటి తప్పు చేయలేదని, ఆమె కడిగిన ముత్యం లాగా బయటికి వస్తారని ధీమా వ్యక్తంచేశారు. ఈ కేసులో కవిత బాధితులరాలు మాత్రమేనని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడారు. కవిత అరెస్టు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదే అని చెప్పారు. కేసీఆర్‌ను తెలంగాణలో, కేజ్రీవాల్‌ను ఢిల్లీలో రాజకీయంగా దెబ్బతీసేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. ఈ కేసులో అసెంబ్లీ ఎన్నికల ముందు సాక్షిగా ఉన్న కవితను లోక్‌సభ ఎన్నికలకు ముందు నిందితురాలిగా మార్చడం రాజకీయ కుట్రలో భాగమే అని చెప్పారు. ఢిల్లీలో మనీశ్ సిసోడియాను తమకు లొంగితే సీఎం చేస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, ఈ విషయాన్ని ఆయనే స్వయంగా చెప్పారని ఆమె గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ లబ్ధి పొందేందుకే బీజేపీ కవితను ఈడీ ద్వారా అరెస్టు చేయించిందని అన్నారు. కవిత ఇంట్లో జరిగిన సోదాల్లో ఏమైనా డబ్బు దొరికిందా అంటే సమాధానం లేదని చెప్పారు. ప్రభుత్వాలు పాలసీలు తేవడం, వాటిని మార్చడం సహజమని, నరేంద్రమోదీ పాలసీలు మార్చడం లేదా అని ప్రశ్నించారు. మోదీ కూడా డబ్బులు తీసుకొని పాలసీలు మారుస్తున్నారా అని నిలదీశారు. కవిత విషయంలో ఈడీ అనేక తప్పులు చేసిందని, రిమాండ్ చేయకుండానే కవితను కస్టడీకి ఇచ్చారని తెలిపారు. మద్యం పాలసీ కేసులో పసలేదని సుప్రీంకోర్టు, ఢిల్లీ కోర్టులు వాదనల సందర్భంగా వ్యాఖ్యానించాయని గుర్తుచేశారు. ఈ కేసులో కథ స్క్రీన్‌ప్లే దర్శకత్వం నరేంద్ర మోదీ అని, మద్యం కేసులో బీజేపీ నేతలు ముందు స్పందిస్తే ఈడీ తర్వాత వచ్చిందని చెప్పారు. బీజేపీ నేతలు చెప్పినట్టే ఈడీ వ్యవహరిస్తున్నదని, కవిత అరెస్టు అవుతుందని బీజేపీ నేతలకు ముందే ఎలా తెలుస్తుందని ఆమె సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై బీఆర్ఎస్‌ను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయని అన్నారు. కవిత పోరాట యోధురాలని, ఆమె కడిగిన ముత్యంలా ఈ కేసు నుంచి బయట పడుతారని చెప్పారు.

మోదీవి చిల్లర రాజకీయాలు: సునీత

ప్రధాని మోదీ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత విమర్శించారు. మోదీ ఓ గల్లీ నాయకుడిలా ప్రవర్తిస్తున్నారని, లిక్కర్ కేసును బీఆర్ఎస్‌కు ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా మోదీ తమ పార్టీపై నిందలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. భ్రష్టాచార్ హటావో అంటూ మోదీ దేశాన్ని భ్రష్ట పట్టించారని ధ్వజమోత్తారు. కవిత రిమాండ్ రిపోర్ట్‌లో తెలంగాణ సీఎం చంద్రశేఖర్‌రావు కూతురు అని రాజకీయ దురుద్దేశంతో ప్రస్తావించారని తెలిపారు. ఇలా రాయడం ఏ కేసు లో ఉండదని, ఇదొక్కటి చాలు బీజేపీ దురుద్దేశం లోకానికి తెలియడానికి అంటూ వ్యాఖ్యానించారు. మోదీకి పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని సునీత అన్నారు.

మాది బహుజనుల రాష్ట్ర సమితి

- బహుజనులకు ప్రాధాన్యం ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీనే
- ప్రవీణ్ చేరికను స్వాగతిస్తున్నాం
- కేసీఆర్ టార్గెట్‌గానే కవిత అరెస్టు
- ఎప్పుడైనా బీఆర్ఎస్ అధినేత వెంటే
- మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం
- రేవంత్‌రెడ్డి భాషపై క్రిమినల్ కేసులు పెట్టాలి: కొప్పుల ఈశ్వర్
- కేసీఆర్ వల్లే మాకు అవకాశం: బడుగుల లింగయ్యయాదవ్

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అంటే బహుజనుల రాష్ట్ర సమితి అని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బహుజనులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్సే అని తెలిపారు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా వాటన్నింటినీ తిరస్కరించి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌లో చేరారని చెప్పారు. తాను బీజేపీలో చేరుతున్నానంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన జన్మదినం సందర్భంగా అయోధ్య వెళ్లి రాముడిని దర్శించుకుంటే బీజేపీలోకి వెళ్లినట్టేనా? అని ప్రశ్నించారు. దుష్ప్రచారం చేసినవారిపై పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. మంగళవారం తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ బహుజనుల పార్టీ కాబట్టే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్టీలో చేరారని తెలిపారు. ఆయనకు పార్టీలోకి స్వాగతం పలుకుతున్నామని వెల్లడించారు. తమ పార్టీలో బహుజన నాయకత్వం బలంగా ఉన్నదని, అంబేద్కర్ సిద్ధాంతాలను అమలు చేస్తున్న పార్టీ బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. కొందరు బీఆర్ఎస్‌లో లాభం పొంది ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారని, ఉద్యమంలో ద్రోహం చేసినవాళ్లే మళ్లీ ఇప్పుడు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను టార్గెట్ చేసేందుకే కవిత అరెస్టు జరిగిందని ఆరోపించారు. కవిత అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణ గడ్డ పోరాటాల గడ్డ అని, కచ్చితంగా మరోసారి పెద్ద పోరాటం మొదలవుతుందని వెల్లడించారు. తమది ఉద్యమ కుటుంబం అని, తనపై పదేండ్లుగా దుష్ప్రచారం జరుగుతూనే ఉన్నదని చెప్పారు. 'అప్పుడూ కేసీఆర్ వెంటే ఉన్నాం.. ఇకముందూ కేసీఆర్ వెంటే ఉంటాం' అని తేల్చిచెప్పారు. ప్రవీణ్‌కుమార్‌లా ఎంతోమంది మేధావులు బీఆర్ఎస్‌లో చేరబోతున్నారని తెలిపారు.

రేవంత్‌ది అధికార దురహంకారం: లింగయ్యయాదవ్

రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పదవిని ఇస్తామన్న కేసీఆర్ ప్రకటనను స్వాగతిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ అంటేనే బడుగుల పార్టీ అని, తెలంగాణ వచ్చాకే కేసీఆర్ నేతృత్వంలో తమలాంటి వాళ్లు పెద్దల సభకు వెళ్లే అవకాశం కలిగిందని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికార దురహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నీళ్లు లేక పొలాలు ఎండిపోతున్నాయని, ఈ ప్రభుత్వానికి సాగు నీరు కూడా ఇవ్వటం చేతకావటం లేదని విమర్శించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నదని, అక్కడి నుంచి 10 టీఎంసీల నీటిని తీసుకొచ్చి నాగార్జున సాగర్ కింద పంటలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. రేవంత్‌లా నీచమైన భాష వాడుతున్న సీఎం దేశంలో మరొకరు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేండ్ల తర్వాత వంద సీట్లతో ఏర్పడబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని అన్నారు.

సీఎంపై కేసు పెట్టాలి: కొప్పుల

రేవంత్ ప్రభుత్వానికి విచారణలపై ఉన్న శ్రద్ధ పథకాల అమలులో లేదని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. గొప్ప పథకాలను పక్కనబెట్టే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి విద్రవీగే మాటలు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఆయన మాట్లాడుతున్న భాషకు ఆయనపై క్రిమినల్ కేసు పెట్టాలని అన్నారు. రేవంత్‌కు దమ్ము ధైర్యం ఉంటే కేసీఆర్ కన్నా మంచిపాలన చేసి చూపాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి వెళ్తున్న నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. బీఆర్ఎస్‌లో నాయకులకు కొదవలేదని, ఎంత మంది వెళ్లినా నష్టం లేదని స్పష్టం చేశారు. ప్రవీణ్‌కుమార్ పార్టీలో చేరడం శుభ పరిమాణమని పేర్కొన్నారు.

23న ఎర్త్ అవర్

రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు లైట్లు ఆపేయండి: అటవీశాఖ

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా మార్చి 23న రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు లైట్లు ఆఫ్ చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్ సూచించారు. ఆ రోజు ఎర్త్ అవర్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్టు పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో 'ఎర్త్ అవర్' పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆమె మాట్లాడుతూ.. ఎర్త్ అవర్ అనేది గ్రహం ఎదుర్కొంటున్న ట్రిపుల్ సంక్షోభాన్ని గుర్తించడానికి, వాతావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టం నివారణకు, పర్యావరణ రక్షణకు దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్విచ్ ఆఫ్ పవర్ ద్వారా ఎర్త్ అవర్ పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఉద్యమంలో వ్యక్తులు, సంస్థలు, వివిధ సంఘాలు అనవసరమైన లైట్లను ఒక గంట పాటు ఆఫ్ చేయాలని పిలుపునిచ్చారు.

మరో ఇద్దరు రైతులు బలి

మొదటిపేజీ తరువాయి...

తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల రైతులు చూసి సుధాకర్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే సుధాకర్ మరణించి ఉన్నాడు. మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానకు తరలించారు.

ఆదిలాబాద్ జిల్లాలో..

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్‌కు చెందిన రైతు కాకేర్ల ఆశన్న(43), సుచరిత భార్యాభర్తలు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. తమనకున్న ఆరెకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆశన్న పేరిట 2.19 ఎకరాలు, సుచరిత పేరిట 3.20 ఎకరాల భూమి ఉన్నది. మూడేండ్లుగా పత్తి సాగు చేశారు. ఇందుకోసం తెలంగాణ దక్కన్ గ్రామీణ బ్యాంకులో రూ.3 లక్షలు, ప్రైవేట్‌గా రూ.2 లక్షలు అప్పు చేశారు. ఈ యాసంగిలో జొన్న సాగు చేశారు. ఇందుకోసం ప్రైవేట్‌గా రూ. లక్ష అప్పు తీసుకొచ్చారు. ఈసారి కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. మంగళవారం చేనుకు నీరు పెట్టడానికి అని ఇంట్లో చెప్పి వెళ్లాడు. చేనులోనే పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా.. అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు.

పార్టీ మారడం లేదు

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): తాను, సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ సహచర ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ఒక న్యూస్ చానల్ ప్రసారం చేస్తున్న కథనాల్లో వాస్తవం లేదని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పష్టంచేశారు. ఎవరెన్ని అసత్య ప్రచారాలు చేసినా బీఆర్ఎస్ కార్యకర్తలు నమ్మొద్దని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తాము మంగళవారం ఏ హోటల్‌లోనూ సమావేశం నిర్వహించలేదని, క్యాంప్ ఆఫీసులో మాత్రమే ఉన్నామని చెప్పారు. మీడియాలో వందసార్లు రాసినా తాను పార్టీ వీడే ప్రసక్తేలేదని, కేసీఆర్ నాయకత్వంలో కొనసాగుతానని తెలిపారు. పార్టీ గేట్లు కాదు, మొదట హామీల గేట్లు తెరవాలని కాంగ్రెస్ పార్టీకి చురకలేశారు.

బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు

- బీజేపీ, కాంగ్రెస్‌ది విష ప్రచారం
- ప్రణీత్‌రావు ఎవరో నాకు తెలియదు
- మాజీ మంత్రి ఎరబెల్లి దయాకర్‌రావు

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం, బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

హనుమకొండ, మార్చి 19: తాను బీఆర్ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి ఎర్రబెల్లి పాల్గొన్నారు. అనంతరం ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడారు. తాను బీజేపీలో చేరుతున్న వస్తున్న వార్తలు అవాస్తవమని కొట్టిపారేశారు. కాంగ్రెస్, బీజేపీలు కావాలనే తనపై విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యకర్తలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు చేస్తున్న దుష్ప్రచారాలు నమ్మవద్దని సూచించారు. వ్యాపారాలు, భూ దందాలు, తప్పుడు పనులు చేసిన నాయకులు పార్టీని వీడుతుంటే కార్యకర్తలు అధైర్య పడొద్దని, పార్టీ అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల పాలన చూసి బీఆర్ఎస్ పార్టీని ఓడించి తప్పు చేశామని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఇప్పటికి వరకు 2 పథకాలు మా త్రమే అమలు చేసిందని విమర్శించారు. వంద రోజుల పాలనలో పంటలు ఎండిపోయాయని, కరెంటు రావడం లేదు, తాగునీరు అందడం లేదని ఇందుకు కారణం కాం గ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్, వార్ రూంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, ప్రణీత్‌రావు ఎవరో తెలియదని అన్నారు. ఆయన అమ్మమ్మ ఊరు త మ స్వగ్రామం పర్వతగిరి అయినంత మా త్రాన ఆయనతో సంబంధం ఉన్నట్టా? అని ప్రశ్నించారు.

ప్రాథమిక హక్కుల హత్య

మొదటిపేజీ తరువాయి...

వాదనలు వినిపిస్తూ ఓ సందర్భంలో.. కవితను అరెస్ట్ చేయబోమంటూ గతంలో ఇచ్చిన అండర్‌టేకింగ్‌ను వెనక్కు తీసుకుంటామని అన్నారని కవిత న్యాయవాదులు గుర్తుచేశారు. దీనికి న్యాయస్థానం ఒప్పుకోలేదని, విచారణను ఈ నెల 19కి వాయిదా వేసిందని తెలిపారు. ఈడీ తరపున అండర్‌టేకింగ్‌ను కోర్టులో దాఖలు చేసినప్పటి నుంచి ఈ నెల 15 వరకు కవితపై చర్యలు తీసుకునేందుకు కోర్టు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని గుర్తుచేశారు. అయినా ఈ నెల 15న కేసు వాయిదా పడిన వెంటనే ఈడీ నిజస్వరూపం బయటపడిందని, తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. మధ్యాహ్నం 2:30 గంటలకు ఈడీ అధికారులు కవిత ఇంట్లోకి ప్రవేశించారని, తనిఖీల అనంతరం 5:20 గంటలకు అరెస్ట్ చేస్తున్నట్టు ప్రకటించారని తెలిపారు. సాయంత్రం 6:45 గంటల వరకు సూర్యాస్త మయం తర్వాత కూడా తనిఖీలు కొనసాగాయని చెప్పారు. కవితను అరెస్ట్ చేయడం ద్వారా ఈడీ చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా, ఆమె ప్రాథమిక హక్కులను హత్యచేసినట్టు భావించాల్సి వస్తున్నదని అన్నారు. సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతుండగా అరెస్ట్ చేయడం ద్వారా ఈడీ అధికారులు శిక్ష పడుతుందనే భయం కూడా లేకుండా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారని తెలిపారు. పైగా ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో సరైన కారణం కూడా చూపించలేకపోయారని అన్నారు. ఈడీ చెప్పిన కారణాలన్నీ నవంబర్ 2022 నాటివని, గత ఆగస్టులో ఇచ్చిన ప్రకటనతో ఎలాంటి సంబంధం లేనివనిని తెలిపారు. అసలు కవితపై ఎలాంటి కేసు లేదన్నారు. ఎవరో కొంతమంది వ్యక్తులు ఇచ్చిన ప్రకటనల ఆధారంగా మాత్రమే ఆమెను ఇందులో ఇరికించారని చెప్పారు. ఆ వ్యక్తుల నుంచి తీసుకున్న ప్రకటనలు బెదిరించి, బలవంతంగా తీసుకున్నవేనని, అరుణ్ రామచంద్ర పిళ్లై తన ప్రకటనను వెనక్కి తీసుకోవడమే ఇందుకు సాక్ష్యమని తెలిపారు. ఈ నేపథ్యంలో కవితకు వ్యతిరేకంగా కొంతమంది చేసిన ప్రకటనలకు విశ్వసనీయత లేదని, వాటిపై తీవ్రమైన సందేహాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

ముందుగానే విమానం టికెట్

కవితను ఢిల్లీకి తీసుకెళ్లేందుకు ఈ నెల 15న రాత్రి 8:35 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరే విమానం టికెట్‌ను ముందుగానే బుక్ చేశారని న్యాయవాదులు గుర్తుచేశారు. తాము మరో విమానంలో టికెట్ కూడా బుక్ చేశామని ఈడీ అధికారులు మాట్లాడుకుంటుండగా కవిత విన్నారని తెలిపారు. కాబట్టి ఎయిర్‌లైన్స్ అధికారులను పిలిచి టికెట్లు ఎప్పుడు బుక్ చేశారో వివరాలు సేకరించాలని కోర్టుకు విజ్ఞప్తిచేశారు. ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని, 15న కవితను అరెస్ట్ చేశారని, ఇది యాదృచ్ఛికం కాదని, కుట్రలో భాగమేనని అనుమానం వ్యక్తం చేశారు. ట్రయల్ కోర్టుకు సమర్పించిన రిమాండ్ అప్లికేషన్ కూడా తప్పుదోవ పట్టించేలా ఉన్నదని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం సుప్రీంకోర్టు జారీచేసే ఉత్తర్వులను అధికారులంతా పాటించాల్సి ఉన్నప్పటికీ ఈ కేసులో ఈడీ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. మనీలాండరింగ్ చట్టం 2002లోని సెక్షన్ 19(1) ప్రకారం ఒక వ్యక్తిని అరెస్ట్ చేసే ముందు చట్టబద్ధమైన నిబంధనలు పాటించడంతోపాటు, అరెస్ట్ చేయాల్సిన అవసరం ఎందుకొచ్చింది, తమ వద్ద ఉన్న సాక్ష్యాధారాల ఆధారంగా అరెస్ట్ చేసిన వ్యక్తి నేరం గురించి చెప్పే కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. మనీలాండరింగ్ చట్టం, సెక్షన్ 19ని ఒక మహిళపై ప్రయోగించడం చట్టవిరుద్ధంగా పరిగణించాలని విన్నవించారు. ఈనెల 15న తనని అరెస్ట్ చేసిన తర్వాత ప్రత్యేక కోర్టు 16న ఇచ్చిన రిమాండ్ ఆర్డర్ పూర్తి యాంత్రికంగా జరిగిందని, ఇలా అనుచితంగా రిమాండ్‌కి పంపడం ఆర్టికల్ 21, 22(1)(2) కింద హక్కులను హరించడమే అని స్పష్టం చేశారు.

అరెస్టు వెనుక కేంద్ర ప్రభుత్వం

కేంద్రంలోని అధికార పార్టీ నేతల రాజకీయ ఎజెండాలో భాగంగా ఈడీ పని చేస్తున్నదని, ఈడీ కీలుబొమ్మగా మారిపోయిందని ఆరోపించారు. కవితను ఈడీ అరెస్ట్ చేస్తుందని బీజేపీకి చెందిన కొందరు నేతలు గతంలోనే పలుమార్లు చెప్పారని, ఇప్పుడు వారు చెప్పినట్టే జరగడం షాక్‌కు గురి చేస్తున్నదని చెప్పారు.

కవిత ప్రస్తావించిన ప్రధాన అంశాలు

1) సూర్యాస్తమయం తర్వాత అరెస్ట్
2) ముందస్తు ప్రణాళిక ప్రకారమే అదుపులోకి తీసుకోవడం
3) అరెస్ట్ చేసిన అధికారికి చట్టం ప్రకారం తగిన హోదా లేకపోవడం
4) అరెస్ట్ చేయాల్సిన అవసరం లేకపోవడం
5) పిటిషనర్‌కు సరైన కారణాన్ని వివరించలేకపోవడం, ఈడీ అధికారులు ట్రాన్సిట్ రిమాండ్ తీసుకోకపోవడం.

ఈడీ ఆరోపణలు నిరాధారం

మొదటిపేజీ తరువాయి...

స్పష్టం చేసిందన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మంత్రి ఆతిశీ మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఈడీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో తమ పార్టీ నేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను పాల్గొనీయకుండా చేయాలని లక్ష్యంగా చేసుకొన్నదని ఆరోపించారు. ఢిల్లీ మద్యం పాలసీ రూప